క్లుప్తంగా

నేడు ఎంపీ బాలశౌరి రాక

తోట్లవల్లూరు: మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి మంగళవారం తోట్లవల్లూరుకు విచ్చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక కలాసుమాలపల్లిలో రూ.10 లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన సిమెంటు రహదారిని ఉదయం 10.30 గంటలకు ఎంపీ బాలశౌరి, పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌తో కలిసి ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు కార్యక్రమంలో పాల్గొనాలని వెంకటేశ్వరరెడ్డి విజ్ఞప్తి చేశారు.

14 నుంచి రైల్వే గేట్ మూసివేత

మండవల్లి: మండవల్లి – గన్నవరం రోడ్ రైల్వే గేట్‌కు మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఈనెల 14వ తేదీ ఉదయం 7 నుంచి 18వ తేదీ సాయంత్రం 7 గంటల వరకు గేట్ మూసివేస్తున్నట్లు ఎస్సీ రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ ఎం శివప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాహనదారులు, పాదాచారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్సీ పరామర్శ



మండవల్లి: మండలంలోని పెనుమాకలంక గ్రామానికి చెందిన జయమంగళ నాగరాజు రోడ్డు ప్రమాదంలో ఆదివారం మృతి చెందిన విషయం విదితమే. నాగరాజు భౌతికకాయాన్ని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ కైకలూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం సందర్శించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

ఎస్‌ఐ కిషోర్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



పమిడిముక్కల: పమిడిముక్కల ఎస్‌ఐగా సి.కిషోర్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చిలకలపూడి పీఎస్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ సత్యన్నారాయణ వీఆర్‌కు వెళ్లారు. ఏఎస్‌ఐ ఆనందరావు, సిబ్బంది ఎస్‌ఐకు పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు. సిబ్బంది పరిచయం చేసుకొన్నారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని కిషోర్‌కుమార్ తెలిపారు.

ఆరోగ్య సిబ్బంది ఫీవర్ సర్వే

తోట్లవల్లూరు: పాములలంకలో ఫీవర్ సర్వేను ఆరోగ్య సిబ్బంది సోమవారం నిర్వహించారు. తోట్లవల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ సాయిప్రసన్న ఆదేశాలతో ఆరోగ్య సిబ్బంది పాములలంకలో ఇంటింటికీ వెళ్లి జ్వరాల సర్వే జరిపారు. ఇద్దరికి జ్వరం వచ్చి తగ్గిందని, మరో ఇద్దరు జ్వరంతో బాధపడుతున్నట్లు ఆరోగ్య సిబ్బంది గుర్తించారు. ఎంపీహెచ్‌ఎస్ అనిల్‌కుమార్, ఏఎన్‌ఎం అనిత, ఆశ కార్యకర్త దివ్య పాల్గొన్నారు.

నందివాడ ఎంపీడీవోగా నాగేశ్వరరావు



గుడివాడ టౌన్(నందివాడ): నందివాడ ఎంపీడీవోగా వీఎస్ నాగేశ్వరరావు సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. విశాఖ జిల్లా ఆనందపురం మండల కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న నాగేశ్వరరావు పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. నాగేశ్వరరావుకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కోటేశ్వరరావు, ఈఓపీఆర్డీ జి.శ్రీనివాసరావు, నందివాడ కార్యదర్శి రామ్మోహన్ తదితరులు స్వాగతం పలికారు. ఎంపీపీ పెయ్యాల ఆదాం అభినందించారు.

కైకలూరు ఎంపీడీవోగా ఉమామహేశ్వరరావు



కైకలూరు: మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)గా ఎస్‌ఎస్.ఉమామహేశ్వరరావు సోమవారం విధుల్లో చేరారు. ఆయన పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేసి ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎంపీపీ అడవి కృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయా సందర్భాల్లో మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, పెంచికలమర్రు సర్పంచ్ జయమంగళ కాసులు, స్థానిక మండల పరిషత్ సూపరింటెండెంటు ప్రకాష్, సీనియర్ అసిస్టెంటు మోహన్ పాల్గొన్నారు.

విద్యుత్ వెలుగులే లక్ష్యం

- రూ.6 కోట్లతో రెండు విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం
- మరో 3 సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు
- నియోజకవర్గంలో 10,134 ఆక్వా సర్వీసులకు సబ్సిడీ



కైకలూరు వైఎస్సార్ గ్రీన్ విలేజ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్

కైకలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కైకలూరు నియోజకవర్గంలో విద్యుత్ కాంతులు వెలుగుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కృషితో నూతన సబ్‌స్టేషన్ల నిర్మాణం శరవేగంగా జరిగింది. లోఓల్టేజీ సమస్యను అధిగమించడానికి విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆక్వా పరిశ్రమ అధికంగా నియోజకవర్గంలో విస్తరించి ఉండటం వల్ల విద్యుత్ డిమాండ్ ఇక్కడ అధికంగా ఉంటోంది. దీనిని అధిగమించడానికి నూతన సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ అధికారుల పనితీరు ప్రశంసలు అందుకుటోంది.

రూ.6 కోట్లతో..

కైకలూరు వైఎస్సార్ జగనన్న గ్రీన్ విలేజ్‌లో ఏపీ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో రూ.4.15 కోట్ల నిధులతో ఇటీవల 33/11 కేవీ ఏఐఎస్ ఇండోర్ విద్యుత్ ఉప కేంద్రాన్ని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ ప్రారంభించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన మూడు ఫీడర్ల నుంచి 2 ఫీడర్లు జగనన్న కాలనీకి, మరో ఫీడర్ ఆటపాక గ్రామానికి విద్యుత్ సరఫరా అందిస్తున్నారు. కలిదిండి మండల కాళ్లపాలెం గ్రామంలో రూ.కోటి 75 లక్షలతో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మించారు. ఈ నెలలో ప్రజలకు అందుబాటులోకి రానుంది.

ఆక్వారంగానికి పెద్ద పీట..

ఆక్వారంగంలో విద్యుత్ వాడకం ఎక్కువ. రొయ్యల చెరువులకు ఆక్సిజన్ అందించే క్రమంలో ఏరియేటర్లు నిత్యం తిరుగుతుంటాయి. కైకలూరు నియోజకవర్గం నాలుగు మండలాల్లో 75304.77 ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. ఆక్వా పరిశ్రమకు సంబంధించి ఆక్వా విద్యుత్ సర్వీసులు 10,134 ఉన్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో అధికారంలోకి రాగానే ఆక్వా రైతులకు విద్యుత్ యూనిట్‌ను రూ.1.50కి అందిస్తానని ఇచ్చిన హామీ అమలు చేస్తున్నారు. రాష్ట్రంలోనే కొల్లేరు ప్రాంతం నుంచి ఆక్వా ఉత్పత్తులు అధికంగా రవాణా అవుతుండటంతో విద్యుత్ కొరత లేకుండా ఆక్వా రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పిస్తోంది.

మరో మూడు సబ్‌స్టేషన్లకై..



కలిదిండి మండలం కాళ్లపాలెం వద్ద ప్రారంభానికి సిద్ధంగా విద్యుత్ సబ్‌స్టేషన్



కైకలూరు గ్రీన్ విలేజ్ వద్ద సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు (ఫైల్)

నియోజకవర్గంలో 18 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. అన్ని కేటగిరీల విద్యుత్ సర్వీసులు కలిపి 128,048 ఉన్నాయి. కలిదిండి మండలం కొండంగి, మండవల్లి మండలం ఇంగిలిపాకలంక, ముదినేపల్లి మండలం వైవాక గ్రామాల్లో సబ్‌స్టేషన్ల నిర్మాణానికి విద్యుత్‌శాఖ అధికారులు ప్రతిపాదన పంపారు. కలిదిండి మండలం చినతాడినాడ వద్ద స్థల సమస్య కారణంగా పనులు ప్రారంభం కాలేదు. ఎమ్మెల్యే డీఎన్నార్ కైకలూరు మండలం పెంచికలమర్రు, పందిరిపల్లిగూడెం ఈ రెండు కొల్లేరు గ్రామాల్లో ఒక చోట సబ్‌స్టేషన్ నిర్మించాలని కోరారు. ఇది జరిగితే కొల్లేరు ప్రాంత ఆక్వా రైతులు, ప్రజలకు ఉపయోగకరంగా మారుతోంది.

నియోజకవర్గంలో ఇలా...	
మొత్తం విద్యుత్ సబ్‌స్టేషన్లు	– 18
గృహ అవసర విద్యుత్ సర్వీసులు	– 1,04,377
దుకాణ, వాణిజ్య సంస్థల సర్వీసులు	– 10,395
పరిశ్రమల విద్యుత్ సర్వీసులు	– 242
ఆక్వా పరిశ్రమ విద్యుత్ సర్వీసులు	– 10,134
పంచాయతీ, కుటీర పరిశ్రమలు	– 2,900
కొత్తగా నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్లు	– 2
వీటి నిర్మాణం ఖర్చు	– రూ.6 కోట్లు

వినియోగదారుల సంతృప్తి స్థాయి పెరిగింది



విద్యుత్ వినియోగదారుల్లో సంతృప్తి స్థాయి పెరిగింది. కైకలూరు నియోజకవర్గంలో ఆక్వా పరిశ్రమ కారణంగా విద్యుత్ సరఫరాలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. వైవాక గ్రామానికి విద్యుత్ మూవింగ్ కంటైనర్ కోసం ప్రతిపాదనలు పంపాం. కైకలూరు మండలం గోపవరంలో విద్యుత్ ట్రాన్స్‌–కో భారీ సబ్‌స్టేషన్‌ను త్వరలో నిర్మించనుంది. కాళ్లపాలెంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను త్వరలో ప్రారంభిస్తాం.

– టి.రామకృష్ణ, విద్యుత్ శాఖ ఈఈ, గుడివాడ

పార్టీ ఏదైనా అర్హతే ప్రామాణికంగా పథకాలు

- పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- జుఝవరం గ్రామంలో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం
- హారతులు పట్టిన మహిళలు



ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌కు స్వాగతం పలుకున్న మహిళలు

జుఝవరం(పామర్రు): పార్టీ ఏదైనా సరే అర్హతలు ఉంటే సంక్షేమ పథకాలు ఇస్తున్న జగనన్న ప్రభుత్వం, సంక్షేమ పాలనకు నిదర్శనమని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని జుఝవరం గ్రామంలో రెండో రోజు సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యేకు స్థానిక మహిళలు మంగళహారతులు పట్టి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల వివరాలను తెలియజేశారు. బుక్‌లెట్లను అందజేశారు. గ్రామంలో టీడీపీ జెండా కట్టిఉన్న ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే జగనన్న సక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. అర్హతల ప్రకారం ఎటువంటి పక్షపాతం లేకుండా పథకాల ఫలాలు అందుతున్నాయని ఇంట్లో వారు తెలియజేసి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇదే మన జగనన్న నిష్పక్ష ప్రజా రంజక పాలనకు నిదర్శనమన్నారు. చంద్రబాబు తప్పు చేసి జైలుకు వెళ్లారని ప్రజలు విశ్వసిస్తున్నారని.. అందుకే బంద్ ప్రభావం అంతగా లేదన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ పుట్టి పున్నమ్మ, కో ఆప్షన్‌సభ్యులు ఎండీ హస్మతుల్లా, మండల సచివాలయ కన్వీనర్ ముప్పిడి సురేష్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు కొలుసు కోటేశ్వరరావు, పార్టీ నేతలు కాకర్ల వెంకటేశ్వరరావు, పెయ్యలరాజు, పుట్టి కిషోర్, కుర్వేటి ఆంజనేయులు, సజ్జా సుబ్రమణ్యం, బుర్రా చినబాబు, టీ వీరాంజనేయులు, చిన్నం శ్రీనివాసరావు, తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి, ఎంపీడీవో వై రామకృష్ణ, ఐకేపీ ఏపీఎం తిరుపతిరావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



మున్సిపల్ కమిషనర్‌కు దరఖాస్తు అందజేస్తున్న ఆర్‌కే యూత్ సభ్యులు

గుడివాడ టౌన్: గుడివాడ పురపాలక సంఘ పరిధిలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి రెండు దరఖాస్తులు వచ్చాయి. మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ స్పందన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పెద ఎరికపాడు తదితర ప్రాంతాల్లో రహదారులు గుంతల మయమయ్యాయని వాటిని పరిష్కరించాలని కోరారు. ఇతర ప్రాంతాల్లో విద్యుత్ లైట్లు సక్రమంగా వెలగడం లేదంటూ స్పందనలో ఆర్‌కే యూత్ కన్వీనర్ రామకృష్ణ ఫిర్యాదు చేశారు. స్థానిక బాపూజీనగర్‌కు చెందిన రావి రమేష్ తమ ప్రాంతంలో రోడ్డు ఆక్రమణలను తొలగించాలని మరో దరఖాస్తు అందజేసినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ఇక ఆర్డీఓ కార్యాలయంలో ఒక్క దరఖాస్తు కూడా రాలేదని అధికారులు తెలిపారు.

కుండపోత వర్షం.. రోడ్లు జలమయం



పామర్రు అండర్ పాస్ వద్ద రోడ్డు జలమయం



ముదినేపల్లి పోస్టాఫీసు రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులో వర్షం కుండపోతగా కురిసింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు వర్షం ఎడతెరిపి లేకుండా పడింది. రెవెన్యూ అధికారుల సమాచారం ప్రకారం 54.4 ఎంఎం వర్షపాతం నమోదైంది. ఉరుములు, మెరుపుల ధాటికి ప్రజలు భయాందోళనకు గురయ్యారు. భారీగా కురిసిన వర్షంతో పల్లపు రోడ్లు జలమయమయ్యాయి. మాగాణిలో సాగయ్యే వరిపైరుతోపాటు లంకల్లోని చెరకు, అరటి, కంద, తదితర వాణిజ్య పంటలకు వర్షం మేలు చేస్తుందని రైతులు అంటున్నారు.

పామర్రు: వర్షాలకు మండల పరిధిలోని పలు ప్రాంతాలు జలమయంగా మారాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయం, బస్టాండ్, అరండాల్‌పేట, బాపూజీపేట తదితర ప్రాంతాలలో వర్షపు నీరు రోడ్లపై నిలిచాయి. రోడ్లపైకి చేరిన నీటితో ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారు. తహసీల్దార్ కార్యాలయం ప్రాగణంలో వర్షపు నీరునిల్వ ఉండటంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు అవస్థలు ఎదుర్కొన్నారు. గుడివాడ రోడ్డులోని మచిలీపట్నం–విజయవాడ జాతీయ రహదారిలో ఉన్న అండర్ పాస్ వద్ద వర్షపు నీరు పూర్తిగా గంటల తరబడి నిలిచేస్థాయిలో వర్షం కురిసింది.

భారీవర్షంతో స్తంభించిన జనజీవనం

ముదినేపల్లి రూరల్: మండలంలో సోమవారం భారీ వర్షం కురవడంతో గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఏకధాటిగా నాలుగు గంటల పాటు వర్షం కురిసింది. దీనితో జనజీవనం స్తంభించిపోయింది. పలు కాలనీల్లో అంతర్గత రోడ్లపై వర్షపు నీరు నిలిచి ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. ముదినేపల్లి సెంటర్లో జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నందున వర్షపు నీరు పోయే మార్గం లేక ప్రజలు నానా అవస్థలు పడ్డారు. పోలీసు స్టేషన్ నుంచి పోస్టాఫీసుకు వెళ్లే రోడ్డు, గురజ రోడ్డు పూర్తిగా జలమయం కావడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఊహించని విధంగా ఒక్కసారిగా భారీవర్షం కురవడంతో సాగునీటి సమస్య తొలగిపోయిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మండవల్లి: మండవల్లి, మండలంలోని అనేక గ్రామాల్లో సోమవారం ఉదయం భారీ వర్షం కురిసింది. ఈ సందర్భంగా లోతట్టు ప్రాంతాలలో వర్షం నీరు నిలిచి వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పంట పొలాలకు వర్షం వల్ల నీరు సమృద్ధిగా చేరి మేలు జరుగుతుందని భావిస్తున్నారు.

బంద్ పిలుపునకు స్పందన కరువు

యథావిధిగా కొనసాగిన రోజువారీ పనులు



కైకలూరులో కొనసాగుతున్న వ్యాపారాలు

పామర్రు: తెలుగుదేశం పార్టీ అధిష్టానం బంద్ పిలుపునకు స్పందన కరువైంది. పామర్రులో బంద్ పూర్తి స్థాయిలో విఫలం అయింది. బంద్‌కు ఎవరూ సహకరించకుండా వ్యాపారాలను యథావిధిగా నిర్వహించారు. టీడీపీ నేతలు కానీ, కార్యకర్తలు కానీ రోడ్డు మీదకు వచ్చిన దాఖలాలు లేవు. టీడీపీ నేత చంద్రబాబు తప్పు చేసి దొరికిపోయాడు కాబట్టే ఆయన రిమాండుకు వెళ్లారని ప్రజలు విశ్వాసం వ్యక్తం అవుతోంది. ఈ కారణంగానే ఎవరూ సహకరించిన పరిస్థితి లేదు. నేతలు సహితం తమకు ఎందుకులే అని హైకమాండ్ పిలుపుని పట్టించుకునే పరిస్థితి లేదు. ఆర్టీసీ బస్సులు సైతం రోజులాగానే రాకపోకలు సాగించాయి. దీనితో బంద్ పూర్తిగా విఫలమైంది. ప్రజలు ప్రశాంతంగా వారి పనులు వారు చేసుకున్నారు.

గుడివాడ టౌన్: తెలుగుదేశం పార్టీ ఇచ్చిన బంద్ పట్టణంలో పాక్షికంగా జరిగింది. పట్టణంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు పనిచేశాయి. బ్యాంకులు, పోస్టాఫీస్ వంటి జాతీయ కార్యాలయాలు సైతం యథావిధిగా పనిచేశాయి. ఆర్టీసీ బస్సులు సజావుగా నడిచాయి. కొందరు తెలుగుదేశం కార్యకర్తలు పట్టణంలోని కొన్ని పాఠశాలలను బలవంతంగా మూయించారు. బంద్‌కు స్పందించేందుకు కార్యకర్తలు పెద్దగా రాకపోవడంతో బంద్ విఫలమయిందనే చెప్పవచ్చు. ఇక వ్యాపార సముదాయాలు ఉదయం కొద్ది సేపు మూసివేసి తిరిగి నిరాటంకంగా వ్యాపారాలు కొనసాగించారు.

పెదపారుపూడి: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టీడీపీ సోమవారం బంద్‌కు పిలుపునిచ్చిన ఏమాత్రం స్పందన కనిపించలేదు. ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార షాపులు యథావిధిగా పని చేశాయి. చంద్రబాబు అరెస్టుపై మండల ప్రజల నుంచి స్పందన కనిపించ లేదు.

మొవ్వ: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టుతో బంద్ ఎఫెక్ట్ మొవ్వ మండలంలో కానరాలేదు. మొవ్వ మండలంలోని ప్రధాన కూడళ్లు అయిన కూచిపూడి, పెదపూడి, నిడుమోలు, కాజ తదితర గ్రామాల్లో బంద్ ఆనవాలే కనిపించలేదు. ప్రధానంగా కూచిపూడి, పెదపూడి సెంటర్లో దుకాణాలు తెరిచే ఉన్నాయి. కూచిపూడిలోని స్టేట్‌బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్, పెదపూడిలోని యూనియన్ బ్యాంక్, కూచిపూడి, పెదపూడిలోని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు యథావిధిగా సాగాయి.

బంద్ ప్రభావం లేదు

ముదినేపల్లి రూరల్: టీడీపీ బంద్ ప్రభావం కనిపించలేదు. ఆపార్టీకి చెందిన ఏ ఒక్కరూ బంద్ కోసం ప్రయత్నించకపోవటం విశేషం. మధ్యాహ్న సమయానికి కొద్దిమంది ద్వితీయ శ్రేణి నాయకులు ముదినేపల్లికి చేరుకున్నప్పటికీ బంద్‌కు ప్రజలు సహకరించలేదు.

కైకలూరులో విఫలం

కైకలూరు: చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ టీడీపీ ఇచ్చిన రాష్ట్ర స్థాయి బంద్ కైకలూరు నియోజకరవర్గంలో విఫలమైంది. సోమవారం యథావిధిగా ప్రజలు దైనందిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దుకాణాలు తెరుచుకున్నాయి. ప్రజలు బంద్ విషయాన్ని అసలు పట్టించుకోలేదు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా 30 పోలీసు యాక్టు అమలులో ఉంటుందని పోలీసులు ముందుగానే నాయకులను హెచ్చరించారు. కైకలూరు పోస్టాఫీసులో విధుల అటంకానికి ప్రయత్నించిన టీడీపీ, జనసేన నాయకులను పట్టణ సీఐ ఆకుల రఘు స్టేషన్‌కు తరలించారు. మండవల్లి రహదారిపై వాహనాలకు ఆటంకం కలిగించిన 9 మందిపై ఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేశారు. ముదినేపల్లిలో కొంత సమయం నాయకులు దుకాణాలను మూయించడానికి యత్నించారు. కొద్ది సమయానికే దుకాణాలు షట్టర్లు తెరుచుకున్నాయి. ముదినేపల్లి, కలిదిండి మండలాల్లోనూ బంద్ విఫలమైంది.

కొండలమ్మను దర్శించుకున్న ఎంపీ



గుడ్లవల్లేరు: వేమవరం కొండలమ్మ అమ్మవారిని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి దర్శించుకున్నారు. సోమవారం అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన ఆయనను ఆలయ మర్యాదలతో సన్మానించి అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు. తొలుత వేద పండితులు ఆయన పేరిట అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ పాలేటి చంటి, వైఎస్సార్ సీపీ గుడివాడ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, ఆలయ చైర్మన్ శేషం గోపి, ఈఓ సురేష్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

జెడ్పీ మాజీ చైర్మన్ పిన్నమనేని కాంస్య విగ్రహం ధ్వంసం



ధ్వంసమైన పిన్నమనేని కాంస్య విగ్రహం

మండవల్లి: మండలంలోని ఉనికిలి గ్రామంలో ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో దేశ నాయకుల కాంస్య విగ్రహాలు గతంలో ఏర్పాటు చేశారు. ఇందులో వైఎస్ రాజశేఖర రెడ్డి, ఎన్టీ రామారావు, జెడ్పీ మాజీ చైర్మన్ పిన్నమనేని కోటేశ్వరరావు విగ్రహాలు కాంస్య విగ్రహాలు కాగా, మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాముల విగ్రహాలు సిమెంట్ విగ్రహాలు. ఆదివారం రాత్రి పిన్నమనేని కాంస్య విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. సోమవారం ఉదయం ఈ విషయాన్ని గమనించిన గ్రామస్తులు తీవ్ర ఆవేదన చెందారు. మాజీ సర్పంచ్ కారే వెంకటలక్ష్మి, కారే ధర్మారావు విగ్రహ ధ్వంసం ఘటనను తీవ్రంగా ఖండించారు.

పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యం



సదస్సులో మాట్లాడుతున్న సెక్టార్ సూపర్‌వైజర్ ఉష

పమిడిముక్కల: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సెక్టార్ సూపర్‌వైజర్ ఉష తెలిపారు. తాడంకి–2 సెంటర్‌లో సోమవారం పౌష్టికాహార మాసోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు ఆరోగ్య పరిస్థితులను పరిచూసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, అంగన్‌వాడీ సేవలను వినియోగించుకోవాలని కోరారు. గర్భిణులు 3 నెలల నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు గంగా భవాని, పద్మావతి, భవాని తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్సీ పరామర్శ



కైకలూరు సీహెచ్‌సీ వద్ద ఎమ్మెల్సీ జయమంగళ, ఎమ్మెల్యే డీఎన్నార్ కుమారుడు వినయ్

కైకలూరు: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు వ్యక్తుల కుటుంబాల సభ్యులను కైకలూరు ప్రభుత్వాసుపత్రి వద్ద ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కుమారుడు వినయ్‌కుమార్ సోమవారం పరామర్శించారు. మండవల్లి మండలం పెనుమాకలంక గ్రామానికి చెందిన జయమంగళ నాగరాజు, కైకలూరు మండలం వేమవరప్పాడు గ్రామానికి చెందిన బోడావుల నాగరాజు ఆదివారం వివిధ రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఆస్పత్రిలో ఉంచారు. ఎమ్మెల్సీ జయమంగళ, దూలం వినయ్ వైద్యులతో మాట్లాడి త్వరగా బంధువులకు మృతదేహాలు అందించే విధంగా చర్యలు తీసుకున్నారు. పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పోలీసులపై దౌర్జన్యం కేసులో అరెస్టు

ముదినేపల్లి రూరల్: విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దౌర్జన్యం చేసి విధులకు ఆటంకం కల్పించాడంటూ టీడీపీకి చెందిన వ్యక్తిని స్థానిక పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టు సందర్భంగా ముదినేపల్లిలో కొందరు టీడీపీ కార్యకర్తలు శనివారం ఆందోళనలు చేశారు. వీరిని అదుపు చేసేందుకు ఎస్‌ఐ వెంకటకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రయత్నించగా ఆపార్టీకి చెందిన కే వినోద్ అనే వ్యక్తి పోలీసులపై దురుసుగా వ్యవహరించడంతో పాటు విధులకు ఆటంకం కలిగించారంటూ పోలీసులు ఫిర్యాదు చేశారు. దీంతో కైకలూరు రూరల్ సీఐ డి.కృష్ణమోహన్ కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

గ్రంథాలయానికి భవనం నిర్మించాలని వినతి

మండవల్లి: మండవల్లి గ్రంథాలయాలనికి స్థలం కేటాయించి, సొంత భవనాన్ని నిర్మించాలని ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ ఎస్ భాస్కరరావు, మండల అధ్యక్షుడు టీ అప్పారావు, కార్యవర్గ సభ్యుడు బి.రంగారావు పేర్కొన్నారు. తహసీల్దార్ కె. రాజ్‌కుమార్, ఎంపీడీఓ టి.వెంకటరమణలకు స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. గ్రంథాలయం ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతుందన్నారు. ఇరుకుగా ఉన్న ఈ భవనంలో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.